


రైలు గేటు

ఈ మధ్యనే పేపర్లో చదివేను. కాన్పూరు, ఢిల్లీ రహదారి మధ్య ఒక రైల్వే లెవెల్ క్రాసింగు గేటు మేన్‌గారు తన వృత్తితో ఎంచక్కా వ్యాపారం చేసుకుంటున్నారట. రైలొస్తుంది, రాదు. అది ఆయనకు అనవసరం. కార్లూ, లారీలూ అట్నుంచి ఇట్నుంచి రావడం కావాలి. అటూ యిటూ చూసి గేటు మూస్తాడు. అటుపక్క ఇటుపక్క వాహనాలు ఆగిపోతాయి. అర్జంటుగావున్న వాళ్ళని పోల్చుకుంటాడు. అయిదో పదో వసూలు చేసి గేటు తెరుస్తాడు. టూకీగా అతని వ్యాపారం ఈ విధంగా సాగుతోందిట. ఇట్లా వచ్చే రాబడిలో పైనుంచి కింది వరకూ వాటా లున్నాయట. ఆ విషయం వదిలేద్దాం.

నన్నడుగుతే రైలుగేటులున్న రోడ్డుమీద ప్రయాణం ఎప్పుడూ చిరాగ్గానే వుంటుంది. మనమెక్కిన కారో, బస్సో గేటు దయాదాక్షిణ్యాల మీద నడుస్తుంది. మన కవతల చాలా అర్జంటు పని వుంటుంది. అప్పుడే పడుతుంది గేటు. ఆ వచ్చే రైలు వెంటనే వచ్చి వెళ్ళిపోతే బావుండు. కానీ అట్లా జరగదు. గేటు పడిం తర్వాత ఒక్కోసారి అట్నుంచీ ఇట్నుంచీ కూడా వస్తాయి రైళ్ళు. ఖర్మకాలితే ఆ రెండూ గూడ్సు బళ్ళే అవుతాయి. గూడ్సంటే మాటలా? హనుమంతుడు తోకని పెంచినట్టు ఆ చివర్నించి ఈ చివరి వరకూ వుంటాయి పెట్టెలు. గూడ్సు గనక అదెట్లా, ఎంత వేగంతో వెడుతుందో వివరించనక్కర్లేదు. గూడ్సు బళ్ళు వెళ్ళేంతవరకూ మనం నోళ్ళు విప్పి చూస్తూ నించోడం మినహా మరేం చెయ్యడానికి వీల్లేదు.

చిన్నప్పుడు నా కదంతా సరదాగా ఉండేది. మా వాళ్ళు విసుక్కుంటుంటే నేను మాత్రం గూడ్సు పెట్టెలు లెక్కపెడుతుండేవాడిని. ఆ గూడ్సు కన్ని పెట్టెలు, దీని కిన్ని పెట్టెలని వివరించి చెప్పి, విసుగుతో వున్న వాళ్ళ నుంచి చివాట్లు తినేవాడిని. ఇప్పుడట్లా కాదు, వయసు పెరిగింది. గూడ్సు పెట్టెలు లెక్క పెట్టుకుంటూ నించోటానికి టైం లేదు. వేగం, పరుగు పందే లేసుకున్నట్టు జీవితంలో పరుగెత్తుతున్నాను. ఇట్లాంటప్పుడు గేటు పడితే కోపం వస్తుంది. ఒక గూడ్సు వెళ్ళేటప్పటికే ఓర్పు నశిస్తుంది. రెండో గూడ్సు కూడా వస్తుందని తెలిస్తే దానికంటే ముందు ఏడుపు వస్తుంది.

గూడ్సు గోల అట్లా వుంచండి. ఒక్కోసారి పాసింజరు రైళ్ళు వెడుతుంటాయి. రైల్లో కూర్చున్న అదృష్టవంతులు రోడ్డు మీద వెర్రి మొహాల్తో నిలబడ్డ మనల్ని చూసి వెకిలిగా నవ్వుతారు. చేతులూపుతారు. హె హె హె అని ఎగతాళి చేస్తారు. కొంటెతనం మరీ పేట్రేగిపోతే మనకి కోపం తెప్పించే సంజ్ఞలు కొన్ని చేస్తారు. అప్పుడు మన తల కొట్టేసినంత పనవుతుంది. రైలాగితే బాగుండు, వాళ్ళని కిందకి గుంజి రెండిచ్చుకుందా మనిపిస్తుంది. ఒక పక్క ఆలస్యమవుతున్నందుకు దుఃఖం. రెండో ప్రక్క రైల్లోంచి జనం మనల్ని ఆఫ్టరాల్‌గా చూస్తున్నారనే అవమానం. వీటితో మనకి పిచ్చెక్కుతుంది.

హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్ళే రోడ్డుమీద ఆరో, ఏడో గేటు లున్నాయి. ఎప్పుడు వరంగల్ వెళ్ళవలసి వచ్చినా (రోడ్డుమీద) నాకు భయం భయంగానే వుంటుంది. బయలుదేరిన వేళ మంచిదయితే ఒక్క గేటు కూడా పడదు. వరంగల్ దిగి హమ్మయ్య అనుకోవచ్చు. సాధారణంగా ఒకటో రెండో పడతాయి. ఆ స్థాయిలో హింస అనుభవిస్తాను. దరిద్రం నా వెంట పడితే ఇక చెప్పనక్కరలేదు. దారి పొడుగుతా గేట్లు మొత్తం పడిపోతుంటాయి. ఒక్కో గేటు దగ్గర పది నిమిషాలో, పావుగంటో వెయిటింగు. అలాంటప్పుడు బస్సుదూకి పారిపోదా మనిపిస్తుంది.

ఈ మధ్యనే రైలు గేటు మీద నాకున్న కోపాన్ని వేదాంతంగా మలుచుకున్నాను. బ్రతికే బ్రతుకులో ప్రతి నిమిషం సుఖంగా గడవాలని మనిషి అనుకోవచ్చు. కాని అది సిద్ధాంత రీత్యా తప్పు. ఎన్నో ఈతి బాధలు కూడా ఎదురవుతాయి. వాటికి తలొంచి వెళ్ళడమే జీవితం. రోడ్డు మీద రైలు గేట్లు, ఈతిబాధలు, రోడ్డు ప్రయాణం మన జీవితం ఎప్పుడు పడుతుందో, ఎక్కడ పడుతుందో తెలీదు. మన కిష్టమున్నా, లేకపోయినా గేటు పడుతుంది. చిరాకు కలుగుతుంది. అవమానం ఎదురవుతుంది. కోపం వస్తుంది. దుఃఖం కృంగదీస్తుంది. ఓర్చుకోడం మనిషి ధర్మం. గేట్ మేన్లంతా గ్రేట్ మేన్లనుకోడానికి వీల్లేదు. వార్తలో గేట్ మేన్ అయిదుకి, పదికీ పడిపోయాడు. అట్లాగే జీవితంలో ఎదురయ్యే కొన్ని చిరాకులు కూడా అయిదుకి, పదికీ కాకపోతే వందలకీ, వేలకైనా లొంగుతాయని....గేట్ మేన్ లాటి గ్రేట్ మేన్ అందుకు ఆహ్వానం పలుకుతున్నారని నాకు అనిపిస్తుంది.